నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: జనప్రియ సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హెచ్‌పీ రోడ్డు, లక్ష్మీకళ థియేటర్ ఏరియా, శ్రీరాములు థియేటర్ ఏరియా, అశ్విని హెయిర్ ఆయిల్ లేన్, ఉదయం 11 నుంచి 11.30 గటల వరకు సీతా రామయ్య టవర్స్, న్యూ శాస్త్రీనగర్, హేమావతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

'ఫీజుల పేరిట వేధించే విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి'

ఉస్మానియా యూనివర్సిటీ: ఫీజుల పేరుతో విద్యార్థులను వేధించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఓయూలో గురువారం ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్, టెక్నో, ఒలింపియాడ్ తదితర స్కూల్స్, కాలేజీల్లో తరచూ ఫీజుల కోసం వేధింపుల ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచి వసూలు చేయడం వలన పేద మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బూర శ్రీనివాస్, చంద్రమోహన్ రాయ్, శ్రీనునాయక్, గోదా రవీంద్ర, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలి



కార్యకర్తల సమావేశంలో కోట నీలిమా

సనత్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమా సూచించారు. బేగంపేటలో గురువారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ప్రజా సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, జీహెచ్‌ఎంసీ, విద్యుత్, ఇంజినీరింగ్ విభాగాల సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చూడాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకుసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నేత విశాల్ సూదం, తస్లీమ్, మాధవి, బుష్రా, యాకా రాధా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర లలిత విష్ణు పారాయణ సత్సంగ్ కమిటీ ఎన్నిక



రాంగోపాల్‌పేట్: ప్రజల్లో భక్తి భావం పెంపొందించడంతో పాటు, సామాజిక సేవా కార్యక్రమాల కోసం తెలంగాణ రాష్ట్ర లలిత విష్ణు పారాయణ సత్సంగ్ కమిటీని ఏర్పాటు చేశారు. మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరీ దేవి అమ్మవారి ఆలయంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు అన్నపూర్ణ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించి కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షురాలిగా వీరల ఉపాధ్యక్షురాలుగా రంగామణి, ఎస్ఎస్ కుమారి, ప్రధాన కార్యదర్శిగా విజయలక్ష్మి, సహాయ కార్యదర్శిగా సరోజినీదేవి, శ్రీదేవి, కార్య నిర్వాహక కార్యదర్శులుగా వాణి, విజయలక్ష్మి, కోశాధికారిగా అరుణను ఎన్నుకున్నారు.

'కేంద్ర బడ్జెట్‌లో రైతులకు అన్యాయం'

పంజగుట్ట: కేంద్ర బడ్జెట్‌లో రైతులకు అన్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య ఆగ్రహం వ్యక్తం చేసింది. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సమాఖ్య అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి దూదిపాల విజయ్‌పాల్ రెడ్డి, లీగల్‌అడ్వైజర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని కానీ ఇప్పటివరకు సగం మంది అర్హులకు కూడా రుణమాఫీ చేయలేదన్నారు. వెంటనే ప్రభుత్వం దేశంలో రైతుల లెక్కలు సేకరించి వారికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చి విద్య, వైద్యం, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం జరుగుతున్నా ప్రశ్నించాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం కావడం బాధాకరమని, ఆయన వెంటనే బయటకు వచ్చి ప్రజల కష్టాలు తెలుసుకోవాలన్నారు. కేంద్రం ఇప్పటికైనా బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని కోరారు. అందుకు రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, కేంద్రమంత్రులు చొరవ తీసుకోవాలని కోరారు. డి.పి.రెడ్డి, ఎస్.రామస్వామి, శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఆపరేషన్ రోప్ కొందరికేనా..?

చిరు వ్యాపారులపైనే ప్రతాపం | బడాబాబులను పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు | సర్వత్రా విమర్శలు



ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఓ హోటల్ ఎదుట ఫుట్‌పాత్‌పైనే నిలిపిన వాహనాలు

రాంగోపాల్‌పేట్: నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు తీసుకువచ్చిన ఆపరేషన్ రోప్ పనితీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో వాహనాల రాకపోకలు, పాదాచారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఇటీవల ఆపరేషన్ రోప్‌ను ప్రారంభించారు. అయితే దీనిని అందరికీ వర్తింపజేయాల్సిన ట్రాఫిక్ పోలీసులు కేవలం చిరు వ్యాపారులపైనే ప్రతాపం చూపిస్తూ బడా వ్యాపారులను మాత్రం వదిలేస్తున్నారనే విమర్శలు వ్యక్తం వ్యక్తమవుతున్నాయి.

చిరు వ్యాపారులపైనే..

ఉత్తర మండలం పరిధిలోని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మోండా మార్కెట్ కీలకమైన ప్రాంతాలు. నిత్యం ఇక్కడ వాహనాల రాకపోకలతో రోడ్లు కిక్కిరిసి ఉంటాయి. దీనికి తోడు రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారం చేస్తుండడంతో సమస్య



మినిస్టర్ రోడ్‌లో కార్ యాక్సెసరీస్ షాపుల యజమానులు ఆక్రమించిన ఫుట్‌పాత్, రోడ్డు

మరింత జఠిలంగా మారుతోంది. అయితే ఇటీవల ట్రాఫిక్ పోలీసులు ఇక్కడి ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. మోండా మార్కెట్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ప్యారడైజ్, సింధీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్ వ్యాపారాలను తీసివేశారు. అయితే కొన్ని బడా, బడా సంస్థల ఎదుట అక్రమ వాహనాల పార్కింగ్‌లను అలాగే వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మినిస్టర్ రోడ్డులో కిమ్స్ ఆస్పత్రి ఎదుట పదుల సంఖ్యలో చిరు వ్యాపారాలను తొలగించారు. ఇప్పుడు ఆస్పత్రి యాజమాన్యం ఫుట్‌పాత్‌తో పాటు రోడ్డును ఆక్రమించి కార్లు, ద్విచక్ర వాహనాలు, అంబులెన్సులు యథేచ్ఛగా రోడ్లపైనే నిలుపుతున్నారు. ఎన్టీఆర్ విగ్రహం నుంచి మినిస్టర్ రోడ్డులో కార్ల యాక్సెసరీస్ షాపుల యజమానులు, ఫుట్‌పాతే కాకుండా రోడ్డును సైతం ఆక్రమించి తమ వ్యాపారాలు సాగిస్తున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. రాణిగంజ్ లాంటి ముఖ్యమైన వ్యాపార ప్రాంతంలోనూ షాపుల ఎదుట సామగ్రిని, వాహనాల పార్కింగ్‌ను అలాగే వదలిపెట్టారు. దీంతో ఇక్కడ నిత్యం ట్రాఫిక్ జామ్‌లు అవుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు కేవలం చిరు వ్యాపారులపై ప్రతాపం చూపించి బడా బాబులను వదలిపెట్టడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతిరోజూ నియంత్రిస్తున్నాం..

బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతిరోజు ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా రోడ్డు మీద వాహనాలు పార్కింగ్ చేసినా, ట్రాఫిక్ అవాంతరాలు కలిగించిన చలాన్లు విధిస్తున్నాం.
– బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య

అధిక రుసుం వసూలు చేస్తే చర్యలు



తుకారాంగేట్ కేంద్రంలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ భీమయ్య గౌడ్

అడ్డగుట్ట: రేషన్ కార్డు దరఖాస్తుదారుల నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్ హెచ్చరించారు. మండల పరిధిలోని అడ్డగుట్ట, రియోపాయింట్, తుకారంగేట్ ప్రాంతాల్లోని మీసేవా కేంద్రాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు మీసేవా కేంద్రాల్లో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు సందర్శించినట్లు తెలిపారు. దరఖాస్తుకు తీసుకుంటున్న రుసుం వివరాలను దరఖాస్తుదారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ మోహన్ ఉన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 25, బజ్జీమిర్చి 18, క్యాప్సికం 28, పచ్చకాకర 32, పందిరి బీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 17, దొండ 35, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 28, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 21, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 22, చామగడ్డ 45, మొరంగడ్డ 23, కందగడ్డ 60, సొరకాయ 7, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 4–5, ముల్లంగి 4–5. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఎరుకల సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలి



మాజీ మంత్రి హరీశ్‌రావును సన్మానిస్తున్న ఎరుకల సంఘం నాయకులు

లాలాపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం ఎరుకల సామాజిక వర్గానికి అన్ని రాజకీయ పార్టీలు సరైన ప్రాతినిధ్యం కల్పించాలని ఆదివాసీ ఎరుకల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఆయనను సన్మానించారు. అనంతరం సంఘం కేలండర్‌ను హరీశ్‌రావు చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎరుకల ఆత్మగౌరవ భవనం, పందులు పెంపకందారులకు ఎంపవర్‌మెంట్ స్కీం కింద రూ. 60 కోట్లు కేటాయించిందని, వాటిని యథావిధిగా కొనసాగేలా ప్రభుత్వంతో మాట్లాడాలని కోరామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఎరుకల సామాజిక వర్గాన్ని గుర్తించి గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని విన్నవించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు, కుతాడి రవికుమార్, కోనేటి నర్సింహ, వనం రమేశ్, నాగులు, మొగులయ్య, రవి, నరేశ్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు శ్రీకాంత్



ఉస్మానియా యూనివర్సిటీ: ఈనెల 18న హైదరాబాద్‌లో జరిగే జాతీయ కబడ్డీ పోటీలకు బైనగాని శ్రీకాంత్ ఎంపిక య్యారు. ప్రస్తుతం మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న శ్రీకాంత్‌ను కాలేజీ ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి గురువారం అభినందించారు.

రోడ్డు భద్రత అవగాహన ర్యాలీ



ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

రసూల్‌పురా: సికింద్రాబాద్ పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువ కేంద్రం హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. పీజీ కళాశాల నుంచి ప్యారడైజ్ చౌరస్తా మీదుగా బేగంపేట వరకు తిరిగి కళాశాల వరకు నిర్వహించిన ర్యాలీలో డిగ్రీ, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని వాహనదారులను కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాధర్, వైస్ ప్రిన్సిపాల్ మృదుల, సంధ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగామింగ్ అధికారి రాజేందర్, నెహ్రూ యువక కేంద్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



లాలాపేట: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఎస్ఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 12న మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో తార్నాక స్ట్రీట్ నంబర్–10 లోని మంగళ్‌దీప్ హార్డ్‌వేర్ షాపు నిర్వాహకుడు ధర్మారం చౌదరి షాపు ఎదుట ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి పడి ఉండగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో తార్నాకలో పెట్రోలింగ్ విధుల్లో ఉన్న కానిస్టేబుల్స్ నరేశ్, ప్రమోద్ వెంటనే అక్కడికి చేరుకుని 108 అంబులెన్స్‌ను పిలిపించారు. సిబ్బంది వెళ్లి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడిడి దాదాపు 52 ఏళ్లు ఉంటాయని వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'నోటా ప్రజాస్వామ్యానికి ఆక్సిజన్ లాంటింది'



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్

పంజగుట్ట: నోటా ప్రజాస్వామ్యానికి ఆక్సిజన్ లాంటిందని అఖిల భారత నోటా రాజ్యాంగ ముసాయిదా సభ చైర్మన్ పి.సాద అరుణ్, ప్రధాన కార్యదర్శి బి.జగదీశ్వరరావు పేర్కొన్నారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2014లో నోటాకు కూడా గుర్తు ఉండాలని తానే న్యాయస్థానంలో పిల్ వేశానని దీంతో నోటాకు గుర్తు కేటాయించారని గుర్తుచేశారు. 2032లో దేశంలో సుమారు 100 నియోజకవర్గాల్లో నోటా మొదటి స్థానంలో వచ్చే అవకాశం ఉందన్నారు. నోటా మొదటిస్థానంలో ఉంటే ఎన్నికలు రద్దు చేసి తిరిగి నిర్వహిస్తే ఆ ఖర్చుకూడా ప్రజలపైనే పడుతుందన్నారు. అందుకే ద్వితీయ స్థానంలో వచ్చిన వ్యక్తికి సగం అధికారం నోటా కమిటీకి సగం అధికారం ఇస్తే ఇద్దరూ కలిసి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతారని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు 42శాతం ఇవ్వడానికి చట్టబద్ధత కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రమణ తెలిపారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో రమణ మాట్లాడుతూ... కులగణన సర్వేలో పాల్గొనని వారికి ఈనెల 16 నుంచి 28 వరకు మరో అవకాశం కల్పించినందున ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించాలన్నారు. అలాగే సర్వే పూర్తయిన తరువాత కులాల వారీగా పూర్తి వివరాలు, ఆర్థిక సామాజిక రాజకీయ పరిస్థితులపై సమగ్ర సమాచారాన్ని ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

లో ఓల్టేజీ సమస్యకు చెక్

బంజారాహిల్స్: నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా బంజారాహిల్స్ రోడ్డునంబర్–1లోని నిమ్స్ 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో 12.5 ఎంవీఏ సిస్టంను టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ గురువారం ప్రారంభించారు. ప్రసుతం ఇక్కడ 8ఎంవీఏ సిస్టం మాత్రమే ఉండగా దీని కెపాసిటీని 12.5 ఎంవీఏగా మార్చారు. దీనివల్ల పంజగుట్ట, ద్వారకాపురికాలనీ, బంజారాహిల్స్ రోడ్డునంబర్–1, బంజారాహిల్స్, రెయిన్‌బో, స్టార్ ఆస్పత్రులు, జలగం వెంగళరావు పార్కు తదితర ప్రాంతాల్లో మెరుగైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. టీజీఎస్‌పీడీసీఎల్ సీఈ చిలకమర్రి చక్రపాణి, ఎస్ఈ కరుణాకర్‌బాబు, డీఈ పి.హనుమంతరెడ్డి, ఏడీఈ రమేశ్‌బాబు, ఏఈ వై.రమేశ్‌కుమార్, లైన్స్ ఎస్ఈ దిలీప్‌కుమార్, డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏడీఈ క్లా రయ్య తదితరులు పాల్గొన్నారు.



పట్టుదలతో శ్రమిస్తేనే విజయం



వర్షితను అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



వర్షితను అభినందిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు

సనత్‌నగర్: పట్టుదలతో శ్రమిస్తేనే విజయం సాధించవచ్చని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేటకు చెందిన సిల్వరి పరమేశ్ కుమార్తె వర్షిత ఈనెల 11న జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. దీంతో వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను గురువారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వర్షితను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షిత వచ్చే మార్చిలో ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లోనూ బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు వెంకటేషన్‌రాజు, కుమార్‌యాదవ్, దేశపాక శ్రీనివాస్, అరుణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కీర్తి ప్రపంచానికి చాటిచెప్పాలి

చిలకలగూడ: బాక్సర్ పోటీల్లో ప్రతిభ చూపిన వర్షిత తన కోచ్ మనోజ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పద్మారావును గురువారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వర్షితను అభినందించారు. మరిన్ని విజయాలు సాధించి, ఉన్నత శిఖరాలు అధిరోహించి తెలంగాణ కీర్తిప్రతిష్టలను ప్రపంచానికి చాటి చెప్పాలని ఆకాంక్షించారు. ఇందుకు తనవంతూ సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు.

తక్షశిలా పబ్లిక్ స్కూల్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



అవార్డు అందుకుంటున్న స్కూల్ డైరెక్టర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ తనుప్రీత్ కౌర్

లాలాపేట: శాంతినగర్ లాలాగూడలోని తక్షశిలా పబ్లిక్ స్కూల్ ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ కమ్యూనిటీ అవుట్ రీచ్ అనే ప్రతిష్టాత్మకమైన అవార్డును కైవసం చేసుకుంది. ఈ మేరకు క్యూ అండ్ ఐ టు డే ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించిన ఎడ్యుకేషన్ కాంక్లేవ్‌లో స్కూల్ డైరెక్టర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ తనుప్రీత్ కౌర్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల, విద్యార్థుల ఉన్నతికి తాము అందిస్తున్న సేవలకు గాను అవార్డు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా అవార్డు అందజేసిన క్యూ అండ్ ఐ కి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలి



కలుషిత జలాల సరఫరాను పరిశీలిస్తున్న దృశ్యం

చిలకలగూడ: వేసవిలో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ సూచించారు. జలమండలి అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనిచేయని పవర్, హ్యాండ్‌బోర్ల వివరాలు అందిస్తే మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెస్తామన్నారు. నామాలగుండు ప్రాంతంలో కలుషిత జలాలు సరఫరా అవుతున్నట్లు ఫిర్యాదు రావడంతో ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్లు శిథిలావస్థకు చేరడంతో సమస్య ఉత్పన్నమైనట్లు గుర్తించారు. నూతన పైప్‌లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. ఆమె వెంట జలమండలి సెక్షన్ మేనేజర్ కుషాల్ ఉన్నారు.

ప్రతిభావంతులను స్ఫూర్తిగా తీసుకోవాలి



టీఆర్‌టీ క్వార్టర్స్‌లో తరగతులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్నవారు ఎంతోమంది ఉన్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. సనత్‌నగర్ ఎస్సార్టీకాలనీలోని ప్రభుత్వ రౌండ్‌టేబుల్ పాఠశాల ప్రైమరీ తరగతుల నిర్వహణను సమీపంలోని ప్రభుత్వ టీఆర్‌టీ క్వార్టర్స్‌లో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న భవనంలో గదులు సరిపోక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా 1, 2 తరగతులను టీఆర్‌టీ క్వార్టర్‌లోకి మార్చామన్నారు. ఈ క్వార్టర్ మరమ్మతులు చేసేందుకు సిప్రా ఫార్మా కంపెనీ డైరెక్టర్ శ్రీహరి ముందుకువచ్చి చేయించారని తెలిపారు. కార్యక్రమంలో కొలను బాల్‌రెడ్డి, శ్రీనివాస్, జమీర్‌బేగ్, ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మాచారి, టీచర్లు చంద్రకళ, మూల భాస్కర్, చెన్నకేశవ్, హరిణి, అనరాధా, రామ్‌భాయ్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.


'కుల గణనలో బీసీలకు అన్యాయం చేస్తే సహించం'



అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

పంజగుట్ట: సర్వే పేరిట బీసీలను మరోసారి మోసం చేయాలని చూస్తే సహించేది లేదని బీసీ సాధికారత సంఘం గౌరవాధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ అన్నారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సౌదామి భూమన్న యాదవ్‌తో కలిసి హాజరై మాట్లాడుతూ.. ఆధార్, ఓటర్ కార్డు, విద్యార్థుల సంఖ్య కలిపి రాష్ట్రంలో 4.25 కోట్ల జనాభా ఉండగా కేవలం 3.64 ఉన్నట్లు చూపడంతోనే ప్రభుత్వ ద్వంద్వవైఖరి స్పష్టమౌతుందన్నారు. రాష్ట్రంలో 80 శాతం బీసీలు ఉంటే దానిని 46 శాతానికి తీసుకువచ్చారని సుమారు 25 లక్షల మంది బీసీలను జనాభా లెక్కల నుంచి తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 రోజుల్లో 3.1 శాతం మిగిలిన వారికి కులగణన చేపడతామని పేర్కొంటున్నారని పారదర్శకంగా ఉండాలని కోరారు. బీసీలకు అన్యాయం చేస్తే స్థానికసంస్థల ఎన్నికల్లో తమ తడాకా చూపిస్తామని హెచ్చరించారు. సమావేశంలో వివిధ బీసీ సంఘాల నాయకులు కొత్త లక్ష్మణ్ పటేల్, బి.శంకర్, చలపతిరావు, పి.వాసు, బత్తుల సిద్ధేశ్వర్, బేరి రాంచందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వేగం కన్నా ప్రాణం విలువైనది



అంబేడ్కర్ లా కళాశాల ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ తీస్తున్న దృశ్యం

అంబేడ్కర్ విద్యాసంస్థల డైరెక్టర్ డా. విష్ణుప్రియ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వేగం కన్నా ప్రాణం మిన్నా.. అని ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను ధరించి ప్రాణాలను రక్షించుకోవాలని అంబేడ్కర్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియ అన్నారు. గురువారం అంబేడ్కర్ లా కళాశాల ఎన్‌సీసీ యూనిట్, నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవెర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విష్ణుప్రియ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ డ్రైవింగ్‌లో రోడ్ సేఫ్టీపై అవగాహన పెంచుకోవాలన్నారు. మితిమీరిన వేగం తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు సంకటంగా మారుతుందన్నారు. ఇప్పుడు ఉన్న సమాజంలో ప్రతి ఒక్కరి జీవన విధానంలో ఫోన్ ఒక భాగమైపోయిందన్నారు. అలాగే వాహనాలు నడిపే వారు హెల్మెట్‌ను భాగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన, ఎన్‌సీసీ ప్రోగ్రామ్ ఆఫీసర్ వరలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల నుండి బాగ్‌లింగంపల్లి సుందరయ్యపార్కు వరకు ర్యాలీ నిర్వహించారు.